

దహెగాంలో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం



క రీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అధికారులు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మార్చి 3న కరీంనగర్‌లో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో ఫలితాల వెల్లడికి రెండు నుంచి మూడు రోజులు పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఓటు హక్కును వినియోగించుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- పట్టభద్రులు 74.08, ఉపాధ్యాయులు 90.20 శాతం పోలింగ్ నమోదు
- మార్చి 3వ తేదీన కరీంనగర్‌లో ఓట్ల లెక్కింపు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 6.137 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు.

● 10 గంటల వరకు మందకొడిగా..

ఉదయం 10 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ తర్వాత క్రమేపీ పుంజుకుంది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో నిలబడి ఉన్న ఓటర్లకు చిట్టీలు అందించి ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పట్టభద్రులు 5.96 శాతం, ఉపాధ్యాయులు 11.6 శాతంగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టభద్రులు 20.32 శాతం, ఉపాధ్యాయులు 45.11 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు పట్టభద్రులు 42.30 శాతం మంది ఉపాధ్యాయులు 74.8 శాతం ఓటు వేశారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సరికి జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు 74.08, ఉపాధ్యా యులు 90.21 శాతంగా పోలింగ్ నమోదైంది.

ఇందులో 4,546 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.08 శాతంగా పోలింగ్ నమోదైం ది. 470 మంది ఉపాధ్యాయులు ఉండగా ఇందులో 424 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90.21 శాతంగా పోలింగ్ నమోదైంది. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావులు ఆసిఫాబాద్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమ ఓటుహ క్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఓటింగ్ సరళిని పరిశీలించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ఓల్డు హైస్కూల్‌లో రెండు కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. పట్టణంలో మొత్తం 2,334 ఓటర్లు ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓటేసేందుకు అనుమతించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఆయా పార్టీల నుంచి రెండు శిబిరాలను ఓటింగ్ కేంద్ర సమీపంలో ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మందకొడిగా సాగినప్పటికీ డబ్బులు పంపిణీ చేసిన తర్వాత మధ్యాహ్నం నుంచి ఒక్కసారి ఓటింగ్ శాతం పెరిగింది. డీఎస్పీ రామానుజం, సీఐ రాజేంద్ర ప్రసాద్ గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల పర్యవేక్షణ పూర్తిగా సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్ పరిశీలించారు. సాయంత్రం మూడు గంటల వరకు 2,334 ఓట్లకు గాను 1,200, ఉపాధ్యాయ ఎన్నికకు 209 మందిఓట్లకు 191 ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమయం పూర్తి కావడంతో లోపల ఉన్న ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారి చిట్టీలను అందజేశారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 727 పట్టభద్రుల ఓట్లు ఉండగా, 570 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 29 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు ఉండగా, 29 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఎన్నికల్లో 216 మందికి గానూ 181 మంది తమ ఓటు హక్కుకు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 16 మందికి గానూ 12 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. తహసీల్దార్ రియాజ్ అలీ ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంవద్ద సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా పట్టభద్రులు 317 మందికి గానూ 232 మంది, ఉపాధ్యాయులు 13 మంది ఓటర్లు ఉండగా 12 మంది తమ ఓటు హక్కు వినియోగించుకునానరు తహసీల్దార్ భూమేశ్వర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్ పోలింగ్ సరళి ఏ విధంగా జరుగుతుందని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 227 మంది పట్టభద్రులకు 85.3 శాతం, టీచర్స్ నలుగురు ఓటర్లు ఉండగా వంద శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదనపు ఎస్పీ ప్రభాకర్, సీఐ రమేశ్, ఎస్సై నరేష్, యాదవ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ పర్యటించి పోలింగ్ శాతాన్ని కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలో 232 మంది పట్టభద్రులు ఉండగా 161 మంది, 10 మంది ఉపాధ్యాయులకు ఏడుగురు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కవిత, సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు పర్యవేక్షించారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో 330 మంది పట్టభద్రులు, 259 మంది ఓటర్లు ఓటు వేశారు. 23 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గారూ 21 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 78 శాతం పోలింగ్ నమోదు అయినట్లు సెక్టోరల్ అధికారి రామకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని అదనపు ఎస్పీ ప్రభాకర్ సందర్శించారు. సీఐ రమేష్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది బందో బస్తు ఏర్పాటు చేశారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలో పట్టభద్రులు 393 మంది ఓటర్లు ఉండగా 291 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 27 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 23 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెంచికలపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సందర్శించారు. ఓటర్లకు ఎలాంటి అంతరాయం కలగకుండా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తహసీల్దార్, బూత్ అధికారులను ఆదేశించారు. ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఓటర్లు 20 మందికి గానూ 19 మంది, పట్టభద్రులు 223 మందికి గానూ 168 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ సూర్యప్రకాష్ తెలిపారు. సీఐ బుద్దే స్వామి, ఎస్సై శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పట్టభద్రులు ఓటర్లు 192 మంది ఉండగా 162 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 20 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 16 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఏవో గోపికాంత్‌లు పర్యవేక్షించారు. ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఎనిమిది మందికి గానూ ఏడుగురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీకు 41 మంది ఓటర్లు ఉండగా 34 మంది వినియోగించుకున్నారు. పోలింగ్ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

● పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయంత్రం 4 గంగలకు పోలింగ్ ముగిసే సమయానికి వరసలో నిలబడి ఉన్న వారికి చిట్టీలు అందించి వారందరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలిస్తున్నామని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రతా చర్యల మధ్య కరీంనగర్‌లోని స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, తహసీల్దార్ రియాజ్ అలీ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో ఓటు వేసిన యువతులు



కాగజ్‌నగర్‌లో ఓటు వేసిన దివ్యాంగుడు రవీందర్



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



బెజ్జూరులో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ విఠల్



పోలింగ్ కేంద్రంలో సెల్ ఫోన్ల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్



ఆసిఫాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు



పెంచికలపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



ఓటేసిన టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

దహెగాంలో బోనాల సందడి



దహెగాంలో బోనాలతో వస్తున్న భక్తులు

దహెగాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని ఉమాచంద్రశేఖర ఆలయంలో గురువారం భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బోల్తా పడిన ఉనుక లారీ.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడి కల్ శివారులో అదుపుతప్పి ఉనుక లారీ బోల్తాపడింది. కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఉనుక లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

రైతులు ఏటా పంట మార్పిడి చేయాలి



మిర్చి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంట సాగు చేసే రైతులు ఏటా పంట మార్పిడి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని తాట్‌పల్లి గ్రామంలో మిర్చి పంటను గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొంత కాలంగా మిర్చి పంట పండిస్తున్న రైతులు పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే తీరు పంటలు వేస్తే పంట దిగుబడి తగ్గడమే కాకుండా భూసారం తగ్గుతుందని చెప్పారు.. గతంలో తాట్‌పల్లి గ్రామం రైతులు ఎంతో ఆదర్శంగా ఉండేవారని గుర్తుచేశారు. మొదట సోయాబీన్, ఆ తరువాత పత్తి, ప్రస్తుతం మిర్చి పంట సాగు చేస్తూ మంచి దిగుబడి సాధించారని, మళ్లీ పంట మార్పిడి చేయాల్సి అవసరం ఉందని తెలిపాఉ.. గతంలో రైతుల కోరిక మేరకు తాను తాట్‌పల్లి ప్రాంతంకు విద్యుత్ సౌకర్యం కల్పించానని, రైతులు సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు మనీష్, వసంత్‌రావు, మధుకర్, మౌనిష్, సంతోష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

● మాజీ ఎమ్మెల్యేకు కతజ్ఞతలు

కౌటాల, (ఆంధ్రజ్యోతి): సార్ నేను మీ వల్లనే నడవగలుగుతున్నాను... నా కాలు కోల్పోయినప్పుడు మీరు నాకు ఆసుపత్రిలో చికిత్స చేయించారు.. అందుకు మీకు రుణపడి ఉంటానని ఓ వ్యక్తి మాజీ ఎమ్మెల్యేను గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని తాట్‌పల్లి గ్రామానికి చెందిన బోయిర్ కపిల్ అనే వ్యక్తి నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. చికిత్స కోసం డబ్బులకు ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలుసుకుని 55వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం కృతిమ కాలు అమర్చుకునేందుకు చేయూతనిచ్చారు. దీంతో ప్రస్తుతం కపిల్ తన పనులు చేసుకుంటు న్నాడు. తాట్‌పల్లిలో కొనసాగుతున్న జాతరకు గురువారం మాజీ ఎమ్మెల్యే కోనప్ప హాజరు కావడంతో కపిల్ ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపాడు.

పూలాజీబాబా బోధనలు అనుసరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పూలాజీబాబా బోధనలు ప్రతి ఒక్కరూ అనుస రించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని పాట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన గురువారం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం మలంగి నుంచి దామాజీ వరకు రోడ్డు మంజూరైందని చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధేశ్వర్ సంస్థాన్ జిల్లా అధ్యక్షుడు, పూలాజీ బాబా తనయుడు కేశవ్‌రావ్ ఇంగ్లే, జిల్లా గౌరవ అధ్యక్షుడు వామన్‌రావ్ ఇంగ్లే, అంద్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు కుడె కైలాష్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు మాగాడె విష్ణు, గారులె నారాయణ, కమిటీ సభ్యులు మాగాడె దాదారావ్, డుక్రె సుభాష్, గిరె సుదాం, ఆత్రం రాము, మాగాడె ప్రకాష్, కందారె మారుతి, రంగారావ్ పటేల్, మాజీ సర్పంచ్ కందారె బాలాజీ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



దండేపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

దండేపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి గురువారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్‌దీపక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రతా చర్యల మధ్య కరీంనగర్‌లోని స్ట్రాంగ్ రూంలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు 18 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీలకు 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో ఎనిమిది కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 60 మంది ప్రిసైడింగ్ అధికారులు, 25 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. దండేపల్లిలో 29వ పోలింగ్ కేంద్రంలో మందకొడిగా ఓటింగ్ నమోదు కావడంతో ఎన్నికల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఎస్సై తైసినోద్దీన్, ఆర్‌ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

మహాగాంలో సామూహిక వివాహాలు



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న సిబ్బంది

సిర్పూర్(యు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాగాంలో మహాగాం గురుదేవ్ సేవా ఆశ్రమం అధ్వర్యంలో గురువారం 15 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పేద జంటలకు ఉచిత సమూహిక వివాహాలు ఏర్పాటు చేయడం అనవాయితీగా వస్తోంది. .ఇందులో వివిధ ప్రాంతాలకు చేందిన 15 నూతన జంటలకు వివాహాలు జరిపించారు. సామూహిక వివాహాలరు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తాళి, వస్త్రాలు, అందజేశారు. అతిథులకు భోజనాలు కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గురుదేవ్ సేవా ఆశ్రమం అధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగణ, బీజేపీ నాయకుడు కోట్నాక విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, గురుదేవ్ సేవ ఆశ్రమం పీఠాధిపతి మెస్రం కైలాష్ మహారాజ్, వినాయక్ మహరాజ్, పురుషోత్తం మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం


కాసిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎంగా పదోన్నతి పొంది కొత్తగూడెం వెళ్తున్న కేకే గ్రూపు ఏజెంటు రాందాస్‌ను గురువారం కాసిపేట గనిపై అధికారులు, కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, కాసిపేట గని మేనేజర్ భూశంకరయ్యలు మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాల్లో రాందాస్ పర్యటించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, అధికారులు నిఖిల్, వెంకటేష్, సుమన్, మూర్తి, దిలీప్, మీర్జాగౌస్, ఏఐటీయూసీ నాయకులు రాజేందర్, రవి, అశోక్, రంజిత్, ఐఎన్‌టీయూసీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ నాయకులు బైరి శంకర్, శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కోటపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రాయిపేట గోదావరి వద్ద పుణ్యస్నానానికి వెళ్లి గల్లంతైన పారుపెల్లి గ్రామానికి చెందిన రాదండి రాజేష్ (45) అనే వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో జాలర్లు బుధవారం చీకటి పడే వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం నుంచి జాలర్లు నాటు పడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం సమయంలో రాజేష్ మృతదేహం దొరికినట్లు ఎస్ఐ రాజేందర్ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈఎస్ఐ భవితవ్యంపై నీలినీడలు

- ఆందోళనలో ఉద్యోగులు
- సమస్యలపై కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి ఆరా



కాగజ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి భవితవ్యంపై నీలినీడలు అలుముకున్నాయి. దీంతో ఆసుపత్రిలో పని చేసే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాగజ్‌నగర్‌లో 50 యేళ్ల క్రితం ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు ప్రారంభమయ్యాయి. ఇందులో సర్‌సిల్క్, ఎస్పీఎం కార్మికులకు వైద్య సేవలను అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించేలా నిర్ణయించారు. కాగా 25 ఏళ్ల క్రితం సర్‌సిల్క్ మిల్లు మూతబడింది. 2014లో ఎస్పీఎంను సైతం వివిధ కారణాలతో మూసివేశారు. అప్పటి నుంచి ఈ ఆసుపత్రికి చీకటి రోజులు వచ్చాయి. ఆసుపత్రి భవనం కూడా శిథిలావస్థకు చేరింది.

రెండేళ్ల క్రితం ఈ ఆసుపత్రి భవనం పూర్తిగా తొలగించాలని ఈఎస్ఐ కార్పొరేషన్ అధికారులు నివేదికలను అందజేశారు. పాత భవనా లన్నీ కూల్చివేస్తే దీన్ని ఎత్తివేస్తారా లేక నూతన భవనం కడుతారా అన్న విషయంపై స్పష్టత లేకుండా పోయింది. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ పర్యటించి ఉద్యోగులను వివరాలు అడిగారు. ఈఎస్ఐ నివాస క్వార్టర్లు, కార్మికులకు అందిస్తున్న సేవలు తదితర అంశా లను తెలుసుకున్నారు.

ఇన్‌పేషెంట్లు లేరు..

ప్రస్తుతం కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు ఉండడం లేదు. ఈ ఈ ఎస్ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం కేవలం 19వేల కార్డులు మాత్రమే ఉన్నాయి. ఆసుపత్రిగా సేవలు కొనసాగించాలంటే కనీసం 30 వేల కార్డులు అవసరం ఉంటుంది. డిస్పెన్సరీ ద్వారా సేవలు అందిస్తే కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఉంటే రాత్రిళ్ల ప్రమాదాలు జరిగితే అడ్మిట్ చేసుకునే అవకాశాలుంటాయి. డిస్పెన్సరీలో ఈ అవకాశం ఉండదు. ఒకవేళ ఈఎస్ఐ ఆసుపత్రిని కాగజ్‌నగర్ నుంచి తొలగింపు చేస్తే సిబ్బందిని ఎక్కడకు పంపుతారనే విషయంపై ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఈఎస్ఐ ఆసుపత్రిలో 30 మంది సిబ్బంది పని చేస్తున్నారు. కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా ఈఎస్ఐ ఆసుపత్రిని తొలగించకుండా కొత్త భవనం నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యలు వివరించాం..

డాక్టర్ జగన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి సమస్య, క్వార్టర్ల దుస్థితి విషయమై ఇటీవల కార్మిక, ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్‌కు వివరించాం. ఆసుపత్రిలో ప్రస్తుతం అందిస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

మహిళలకు చదువుతో ప్రయోజనం



మాట్లాడుతున్న వయోజన విద్యా ప్రాజెక్టు అధికారి పురుషోత్తంనాయక్

కాసిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందని వయోజన విద్యా జిల్లా ప్రాజెక్టు అధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. గురువారం కాసిపేటలో అభ్యాసన కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలు సంతకాలు నేర్చుకున్నంత మాత్రాన అక్షరాస్యులుగా పరిగణించబడరని, కనీసం చిన్న చిన్న పదాలు రాయడం, చదవడం , లెక్కలు చేయడం రావాలని సూచించారు. ప్రతి ఒక్కరు పూర్తి అక్షరాస్యులుగా మారేందుకు చదువు నేర్చుకోవాలన్నారు. అలాగే వృత్తి విద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాకారులు ఆట పాటలతో చదువు గురించి వివరించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, డీఆర్‌పీ బండ శాంకరి, కళాకారులు తిరుపతి, కృష్ణ, భూమనమ్మ పాల్గొన్నారు.

ముగిసిన ఈసుగాం జాతర



మహాదేవ్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివాలయంలో శివరాత్రిపర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈసుగాం శివమల్లన్న జాతర గురువారంతో ముగిసింది. గురువారం ఉదయం నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలను సమర్పించారు. అలాగే వివిధ కళాకారులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల మహాదేవ్ ఆలయంలో ఆలయంలో గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదేవ్ జాతరను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎమ్మెల్యే ఆటగాళ్లను పరిచయం చేసుకుని ప్రారంభించారు. జాతరలో ఏర్పాటు చేసుని దుకాణాల్లో వస్తువులు కోవ లక్ష్మి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, ఆత్రం భవంత్‌రావు, తోడసం భాగ్యలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావు, దర్మరావు, హన్ను పటేల్, లాక్యా నాయక్, గణపత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం రెండో రోజు భక్తులు తరలి వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి జాతరకు తరలి రావడంతో ప్రజలతో జాతర కిటకిటలాడింది. మహిళలు, పిల్లలు, యువతి, యువకులు జాతరలో తమకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడంతో సందడి నెలకొంది.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రెండో రోజు మండలంలోని కర్జెల్లి ముసలమ్మ గుట్ట శివాలయం, రుద్రాపూర్‌లోని నాగదేవత ఆలయం, శివపల్లిలోని శివాలయంతో పాటు ఆయా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కర్జవెల్లి శివాయలంలో దిందా గ్రామానికి చెందిన నికాడి తిరుపతి, అమృత అన్నదానం చేశారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్‌పల్లి (కుర్ద) గ్రామంలో మహిశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న జాతరకు రెండో రోజు గురువారం భక్తులు పోటెత్తారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఆలయం ఉండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సమీపంలో పెన్‌గంగా, ప్రాణహిత నది ఉండడంతో పుణ్యస్నానాలు చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జాతరలో రెండో రోజు గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

సాగర్, జైనూర్ ఎస్సై



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎస్సై: శాంతి భద్రత పరిరక్షణ కోసం జైనూరు మండలంలో పకడ్బదీ చర్యలు తీసు కుంటున్నాం. నిత్యం ప్రజల రక్షణ కోసం మారుమూల గ్రామాలకు సైతం వెళుతూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నాం. రాత్రి సమయాల్లో మండల కేంద్రంలో పోలీసులు అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా గస్తీ తిరుగుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఇటీవల కాలంలో మండలంలో క్రైం రేట్ ఏవిధంగా ఉంది?

ఎస్సై: మండలంలో పోలీసులు పర్యటించడం మూలంగా ఇటీవల కేసులు తగ్గాయి. ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జైనూరులో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎస్సై: మండల కేంద్రంలో ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది. బస్టాండ్, అంబేద్కర్ చౌక, కుమరంభీం చౌక్, శివాజీ చౌకల వద్ద ఎల్లప్పుడు సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏంటి?

ఎస్సై: రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నాం.

\- జైనూర్, (ఆంధ్రజ్యోతి)

బీజేపీ నాయకులపై కేసు

నస్పూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుగుణాకర్ విధులకు ఆటంకం కలిగించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన బీజేపీ నాయకుడు కమాలాకర్ రావుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. తీగల్ పహాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ అమలులో ఉండగా కమాలాకర్ రావు, అతనితో పాటు మరికొందరు ఎలక్షన్ కోడ్ ఉల్లఘించి నిర్ధేశించిన హద్దులను దాటి అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్సై సుగుణాకర్‌తో వాగ్వాదానికి దిగినట్లు తెలిపారు. అంతే కాకుండా దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై సుగుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

సింగరేణి డైరెక్టర్ పూజలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా నాగార్జున కాలనీ లోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌లు అభిషేకం చేశారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ టి. శ్రీనివాస్, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి జీఎంకు సన్మానం

రెబ్బెన ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డికి గురువారం వివిధ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎంఎస్ యూనియన్ వర్కర్స్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్యం రాజబాబు, బ్రాంచ్ కార్యదర్శి శివారెడ్డి, ఓజీఆర్, ఎండీగౌస్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ సెక్రటరీ సంగెం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

పెంచికలపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌పై మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేయడలం సరికాదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. సమావేశంలో నాయకులు దేవాజీ, రాజవర్ధన్, షరీఫ్, గంగారాం, దేవదాస్, బాబులాల్, చింటు, తులసీరాం, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కావేటర్ సీజ్

భీమారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : భీమారంలోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌తో పాటు ఒక జేసీబీని బీట్ ఆఫీసర్ శివకుమార్‌తో పాటు బేస్ క్యాంపు సిబ్బంది భీమారం అటవీ డిపోకు తరలించి సీజ్ చేశారు. జేసీబీ ఓనర్ మొండ పున్నంపై ట్రాక్టర్ డ్రైవర్ కాలువ మధుకర్, ఇద్దరు యాజమానులకు చెందిన వాహనాలను సీజ్ చేశామని అటవీ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు పేర్కొన్నారు.

సింగరేణి సమాచారం

శ్రీశైలం తరలివెళ్లిన సింగరేణి రెస్క్యూ సిబ్బంది



శ్రీరాంపూర్ నుంచి శ్రీశైలం తరలివెళ్తున్న రెస్క్యూ సిబ్బంది

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సింగరేణి ఆధ్వర్యంలో పలు రెస్క్యూ బృందాల తరలివెళ్లాయి. ప్రతి ఏరియా నుంచి రెస్క్యూ బృందాలు తరలి రావాలని ప్రభుత్వం ఆదేశించడంతో వేకువ జాము నే పయణమయ్యాయి. మందమర్రి రెస్క్యూ స్టేషన్ పరిధి నుంచి 30 మంది వరకు సభ్యులు వెళ్లారు. ఇందులో శ్రీరాంపూర్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. అలాగే రామగుండం ఏరియా నుంచి కూడా 100 మంది వరకు వెళ్లినట్లు తెలిసింది. అన్ని రెస్క్యూ స్టేషన్ల నుంచి సుమారుగా 200 మంది వరకు ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సింగరేణి రెస్క్యూ బృందం సభ్యులు వెళ్లినట్లు కార్మికులు వెల్లడించారు.

ట్రేడ్స్‌మెన్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా ట్రేడ్స్‌మెన్ సమావేశాన్ని 2వ తేదీన నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై టెక్నీషియన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రేడ్స్‌మెన్ పక్షాన తాము అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించి పరిష్కారానికి తగు నిర్ణయాలు తీసుకునేందుకు వచ్చే నెల 2న నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ట్రేడ్స్‌మెన్ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ట్రేడ్స్‌మెన్ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, నాగభూషణం, సురేష్, వెంకట్ రెడ్డి, మురళీచౌదరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత, ధర విషయంలో రాజీపడం



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో బొగ్గు నాణ్యత, ధర విషయంలో తాము రాజీ పడబోమని సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాంతో సింగరేణిభవన్‌లో విద్యుతేతర సంస్థల నిర్వాహకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. తమ పరిశ్రమల మనుగడ కొనసాగించాలంటే, ఉద్యోగుల భవిష్యత్‌ను కాపాడాలంటే బొగ్గును తక్కువకు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. గతేడాది 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నుల బొగ్గును విద్యుతేతర సంస్థలు కొనుగోలు చేశాయని, ఈసారి 5 మిలియన్ టన్నులకే పరిమితం అవడానికి గల కారణాలను సీఎండీ వారిని అడిగారు. ఇతర ప్రాంతాల్లో తమకు తక్కువ ధరకు బొగ్గు లభ్యమవుతోందని, అందువల్ల సింగరేణి నుంచి తీసుకోవడం లేదని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ధరకే సింగరేణి అందిస్తే ఇక్కడే కొనుగోలు చేస్తామని చెప్పారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ నాణ్యత, ధర విషయంలో తాము రాజీ పడడం లేదని, ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి బొగ్గును కొనుగోలు చేయాలని కోరారు. త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేస్తామని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు డి సత్యనారాయణ(ఈఅండ్ఎం), సూర్యనారాయణ (ఆప రేషన్స్), ఈడీ(కోల్‌మూమెంట్) సుభానీ, జీఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్, జీఎం (సీపీపీ) మనోహర్, ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌ను కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. సీఎం ఓఏఐ ఉపాధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరసింహులు, కార్యవర్గ సభ్యుడు జక్కారెడ్డి ఆధ్వర్యంలో శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. అధికారుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆడిట్ రికవరీ త్వరగా పూర్తిచేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆడిట్ రికవరీ త్వరగా పూర్తిచేయాలని ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ ఆదేశించారు. శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆడిట్ పెండింగ్ రికవరీల సమస్యలపై ఆయన చర్చించారు. రికవరీకి సంబంధించిన రిపోర్టులను అన్ని విభాగాల నుంచి తీసుకోవాలన్నారు. దీని ద్వారా రికవరీకి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, సీనియర్ అకౌంట్స్ అధికారులు శేషు కుమారి, పద్మ, సంక్షేమాధికారి శంకర్, డిప్యూటీ సూపరింటెండ్ సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

మూడో ప్లాంటు ఏర్పాటుకు అనుమతులు

జైపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మూడో ప్లాంటు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, కొద్ది రోజుల్లోనే పనులను ప్రారంభిస్తామని ఎస్టీపీపీ ఇన్‌చార్జీ ఈడీ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎస్టీపీపీలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మూడో యూనిట్ పనులకు సంబంధించి ప్రణాళిక రూపొందిస్తున్నా మన్నారు. సమావేశంలో జేఎన్ సింగ్, ప్రసాద్, సుధాకర్, మదన్ మోహన్, మూడో ప్లాంటు కో ఆర్డినేటర్ వేణుగోపాల్‌రావు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



దండేపల్లిలో పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

(5వ పేజీ తరువాయి)

నగదు పంపిణీ చేసినట్లు తెలుస్తుంది. ఉపాధ్యాయ విభాగంలో ఒక్కో ఓటరుకు రూ. 3వేల నుంచి రూ.5వేల వరకు కవర్లలో పెట్టి నేరుగా ఇళ్ల వద్దకే పంపినట్లు ప్రచారం జరుగుతుంది. పట్టభద్రుల విభాగంలో ఓటుకు వెయ్యి రూపాయల చొప్పున పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఇవిగాక వివిధ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, సంఘాలకు సైతం పెద్ద మొత్తంలో నజరానాలు ముట్టచెప్పినట్లు తెలుస్తోంది.

మార్చి 3న ఓట్ల లెక్కింపు...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ ముగియగా వచ్చే నెల 3వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినం దున ఉపాధ్యాయులు, పట్టభద్రుల అభ్యర్థులు ఎవరి అంచనాల్లో వారున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసింది. రామగుండం కమిషనర్ శ్రీనివాస్ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీలు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

నస్పూర్: నస్పూర్‌లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. నాలుగు పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని తీగల్ పహాడ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 4256 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఓటర్లు 102 మంది ఓటర్లు ఉన్నారు. తీగల్ పహాడ్ ప్రాథమిక పాఠశాలలో (బూత్ నంబరు-25) ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 102 ఓటర్లకుగాను పురుషులు-49 మంది, మహిళలు-38 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో పోలింగ్ సమయం 4 గంటలు ముగిసే సమయానికి 4254 ఓటర్లకుగాను 2241 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యూలైన్లలో ఓటర్లు బారులు తీరి ఉన్నందున సమయానికి క్యూలో ఉన్న వారికి టోకెన్లను ఇచ్చి పోలింగ్ కొనసాగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌లు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఉదయం మందకొడిగా సాగినప్పటికి మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఓటర్ల రాక మొదలైంది. సింగరేణి ఉద్యోగులకు సంస్థ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సమయం ఇవ్వడంతో ఈ సమయంలోనే ఓటర్లు బారిగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిసింది. తీగల్‌పహాడ్‌లోని కేంద్రాల్లో 2783 ఓట్లు పోలయ్యాయి.

లక్సెట్టిపేట: పోలింగ్ కేంద్రాల వద్ద లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై సతీష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు కాశాయం కండు వాలు వేసుకుని ప్రచారం చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు వాళ్లను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. పోలీసులకు, నాయకులకు వాగ్వాదం చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ శ్రీనివాస్ సందర్శించారు.

లక్సెట్టిపేటలో మొత్తం నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు 137 మంది ఓటు వేయాల్సి ఉండగా 128మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పట్టభద్రులు 2,356 మందికి 1749 మంది ఓటు వేసినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ దిలీప్ కుమార్ తెలిపారు.

చెన్నూరు: గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు చెన్నూరులో ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టబద్రులకు 2, ఉపాధ్యాయులకు 1 పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. 25వ పోలింగ్ కేంద్రంలో 551 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 26వ పోలింగ్ కేంద్రంలో 555 మంది ఓట్లు వేశారు. మొత్తం 1508 మంది పట్ట భద్రులకు 1106 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 19వ పోలింగ్ బూత్‌లో 93 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని బొక్కలగూడెం కాలనీకి చెందిన బోగం అను అనే ట్రాన్స్ జెండర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకుంది. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బెల్లంపల్లి : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బెల్లంపల్లిలో 2929 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 1738 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 63 శాతం నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 166 మంది ఉండగా 149 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 91 శాతం నమోదైంది.

పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. కాగా డీసీపీ భాస్కర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ దేవయ్య, ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోటపల్లి : మండల కేంద్రంలో పట్టబద్రులు మొత్తం 482 మందికిగాను 334 ఓట్లు పోలయ్యాయి. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 9 ఓట్లు ఉండగా 9 ఓట్లు పోలయ్యాయి. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ కోటపల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్ఐ రాజేందర్, తహసీల్దార్ మహేంద్రనాథ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

భీమారం: మండల వ్యాప్తంగా గ్రాడ్యుయేట్లు 297 మంది ఉండగా 201 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 12 మందికి 12 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తాండూర్ : తాండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. పోలింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమార స్వామి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ సందర్శించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 614 మంది ఓట్లు వేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకికి 29 మంది ఓట్లు వేశారు. తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీపాద్, త్రివేణి, పోలీసులు పాల్గొన్నారు.

నెన్నెల : మండలంలో గురువారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 391 పట్టభద్రుల ఓట్లకుగాను 272 పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓట్లు 8 మాత్రమే ఉండగా అందులో ఏడుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రులకు 2, ఉపాధ్యాయులకు 1 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 1523 మంది ఓటర్లు ఉండగా 1030 ఓట్లు పో లయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 103 మంది ఉండగా 95 మంది ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు.

కాసిపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిసత్ పాఠశాలలో గురువారం జరిగిన పట్టబద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 762 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 533 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 16 మంది ఓటర్లు ఉండగా 15 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వేమనపల్లి : మండలంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు 167 మంది ఓటర్లు ఉండగా 27 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 8 మంది ఉండగా 8 మంది ఓట్లు వేశారని ఎన్నికల జోనల్ అధికారి తిరుపతి తెలిపారు.

జైపూర్: మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 1095 మంది ఉండగా 660 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి 24 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు జోనల్ ఆఫీసర్ అఖిల పేర్కొన్నారు. తహసీల్దార్ వనజారెడ్డి, జిల్లా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగి ట్రాన్స్ జెండర్ ఉమెన్ లిప్సిక, ఓటు హక్కు వినియోగించుకున్నారు.

●మండల కేంద్రంలోని అరిగెల మల్లగౌడ్ అనే పట్టభద్రుడు ఓటు వేయడానికి 22వ పోలింగ్ కేంద్రానికి వెళ్లగా తన ఓటు హక్కును వేరే వారు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. అధికారులను సంప్రదించడంతో టెండరు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

కన్నెపల్లి: మండలంలో 176 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా 137 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.8 శాతం నమోదైంది. ఉపాధ్యాయులు 4 మంది ఓటర్లు ఉండగా 4 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మందమర్రిరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం మందమర్రిలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 2471 మంది ఓట్లు వేశారు. 215 ఉపాధ్యాయుల ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులకు టెంటు విషయంలో కొంత గొడవ జరగగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ నాయకులకు సర్ది చెప్పారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐలు రాజశేఖర్, రాజశేఖర్‌లు బందోబస్తు నిర్వహించారు.

దండేపల్లి: దండేపల్లిలో 29 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. గంట పాటు నమోదు నమోదు ఆలస్యమైంది. విషయం తెలుసుకున్న కలెక్టర్ దండేపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి దండేపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ సరళిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దండేపల్లి 21 పోలింగ్ కేంద్రంలో 79 మంది ఓటు హక్కును, 28వ పోలింగ్ కేంద్రంలో 633 మంది, 29వ పోలింగ్ కేంద్రంలో 658 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తం 70శాతం మేరకు ఓటు నమోదు అయ్యిన్నట్లు అధికారులు వెల్లడించారు.



మందమర్రిలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



తాండూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు



కాసిపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



దండేపల్లిలో క్యూలో ఉన్న ఓటర్లు..



నెన్నెలలో ఓటు వేసిన పట్టభద్రులు



ఓటు హక్కు వినియోగించుకున్న బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, ఓటర్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్



నస్పూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద భారీగా ఉన్న ఓటర్లు



బెల్లంపల్లిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

క్యాలెండర్ల విడుదల

తాండూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గౌడ జన హక్కుల పోరాట సమితి నూతన సంవత్సరం క్యాలెండర్లను గురువారం తాండూర్ మండల కేం ద్రంలోని ఐబీలో నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికా ర ప్రతినిధి భూసారపు మొండి గౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, భాస్కర్ గౌడ్, నవీన్‌గౌడ్, రాజు గౌడ్, మాజీ ఎంపీపీ ప్రణయ్, సింగిల్ విండో డైరెక్టర్ రత్నా కర్‌రావు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

చెన్నూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తెరసాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలు, టికెట్ల ఆదాయంతో పాటు హుండీలో వేసిన కానుకల లెక్కింపు ఉదయం 11 గంటలకు ఆలయం ఆవరణలో ఉంటుందన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పద్మావతి కాలనీలో బుధవారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో రూ.38వేలు, 4 ద్విచక్రవాహనాలు, కారు, 11 సెల్‌ఫోన్లతో పాటు 11మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

తీగల్‌పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తం

● ఇరు వర్గాల మధ్య తోపులాట..

●అందరినీ చెదరగొట్టి అదుపులోకి తెచ్చిన పోలీసులు

నస్పూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రచారం ఘర్షణకు దారితీసింది. దీంతో ఊరు శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. ఫలితంగా బీజేపీ నాయకులు ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఓటర్లను అభ్యర్థిస్తూ ఇరువైపుల ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో పోలీసులు బారికెట్లను ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకుడు కమాలాకర్ రావు, ఎస్సై సుగుణాకర్ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని కమాలాకర్‌రావు ఆరోపించారు. వారిని అక్కడి నుంచి పంపించేస్తానని ఎస్సై సుగుణాకర్ సమాధానం ఇచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తనను ఎస్సై తోచివేసాడని ఆరోపిస్తూ జాతీయ రహదారిపై బైఠాయించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, రూరల్ సీఐ అశోక్ పోలిస్ సిబ్బంది ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి పక్కకు పంపే ప్రయత్నాలు చేశారు. బీజేపీ మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌కు పోలీసులు నచ్చజెప్పి పంపించి వేసారు. పోలీసులకుపైనే బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎదురు తిరగడంతో తోపులాట జరిగింది. ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తలు కొందరు రాళ్లను విసురుకున్నా రు. ఇంతలోనే రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్‌లు చేరుకున్నారు. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఎన్నికల ప్రచారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వలన ఘర్షణ జరిగింది. ఎస్సై సుగు ణాకర్ అనవసరంగా తనపై చేయి చేసుకున్నాడని, తనపైనే కేసులు పెట్టాలని కుట్రలు చేస్తున్నాడని కమలాకర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తల చేతిలో పోలీసుల లాఠీలు ఉన్నయని ఆరోపించారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ఘర్షణపై సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి బాద్యులపై చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాస్ అన్నారు. బీజేపీ నాయకుడు కమాలాకర్ రావు, ఎస్సై మధ్య మాటమాట పెరిగిందని, సీసీ కెమెరాలను పరిశీలిస్తామన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

జన్నారం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు జన్నారంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఉంటున్నారని తెలుసుకున్న బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజవర్ధన్ వారిని నివారించారు. కాంగ్రెస్ నాయకులను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపించి వేశారు. కొద్ది సేపు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

మానవత్వం చాటుకున్న
పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

బెల్లంపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఓ అనాధ శవానికి అంత్య క్రియలు జరిపి బెల్లంపల్లి టూ టౌన్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. బెల్లంపల్లి పట్టణం కాల్‌టెక్స్ ఏరియాలో గత కొన్నేండ్లుగా ప్లాస్టిక్ కవర్లు ఏరుకుంటూ రోడ్డుపై నిద్రిస్తూ పల్లపు రాజు అనే వ్యక్తి జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం రామకృష్ణ థియేటర్ ఎదురుగా రోడ్డుపై రాజు పడిపోయి ఉండడంతో అక్కడే ఉంటున్న ఒక మహిళ గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. స్పందించిన బెల్లంపల్లి టూ టౌన్ కానిస్టేబుల్ సీహెచ్ రాజీవ్ రతన్, హోంగార్డు సంపత్‌లు ఘటన స్థలానికి చేరుకుని రాజు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. రాజుకు ఎవరు లేకపోవడంతో మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. రాజు మృత దేహానికి పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు జరిపి మానవత్వం చాటుకున్నారు.

తీర్థ ప్రసాదాలు అందజేత

జన్నారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తూముల రామ్‌కిషన్ అయోధ్య ఆలయ నిర్మాణానికి ఆలయ నిర్మాణ సమయంలో రూ. 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ గ్రామం నుంచి అయోధ్య కుంభమేళాకు వెళ్లి వచ్చిన రామ భక్తులు గురువారం రామ్‌కిషన్‌కు అయోధ్య నుంచి తెచ్చిన తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటేష్, ఉపసర్పంచు చింతం చంద్రయ్య శ్రీనివాస్, సత్తన్న, శేఖర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి మిస్సింగ్ : కేసు నమోదు

తాండూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం అయినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్ మండలం కాసిపేట గ్రామానికి చెందిన గొర్లపల్లి రాజమ్మ ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిందని, ఇప్పటి వరకు తన ఆచూకీ తెలియలేదని కుటుంబీకులు తెలిపారన్నారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలో మెరున్‌రంగు చీర కట్టుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన సోగాల పూజిత తాండూర్ మండల కేంద్రంలోని అమ్మమ్మ తాతయ్య దుర్గం నాగయ్య, గంగుబాయి ఇంటికి ఈ నెల 22న వచ్చి తిరిగి ఈ నెల 24 న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి కాగజ్‌నగర్‌కు వెళ్లిందని, ఇప్పటి వరకు ఇంటికి రాలేదని పూజిత తండ్రి మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన బుగ్గ జాతర

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రిని పురస్కంచుకుని నిర్వహించిన జాతర గురువారం ముగిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మునిమంద స్వరూపరమేష్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సంధ్య దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆజాద్ ఉద్యమ స్ఫూర్తిని యువత పునికిపుచ్చుకోవాలి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : ఆజాద్ ఉద్యమ స్ఫూర్తిని యువత పునికి పుచ్చుకోవాల్సిన అవసరం ఉందని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు రాజలింగు అన్నారు. గురువారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. దేశం గర్వించదగ్గ స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో చంద్రశేఖర్ ఆజాద్ ముందు వరుసలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు క్రాంతి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

లక్సెట్టిపేట, ఫిబ్రవరీ 27(ఆంధ్రజ్యోతి): మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవంను గురువారం ఆసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులక పండ్లు బ్రెడ్ పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో నాయకులు కలాల రమేష్‌తో పాటు మరికొందరు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- తరలివచ్చిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు
- పట్టభద్రుల ఓటింగ్ శాతం 67.30
- ఉపాధ్యాయుల ఓటింగ్ శాతం 91.77



ఓటేసిన ట్రాన్స్ జండర్

చంటి పాపతో వచ్చిన పట్టభద్రురాలు



నస్పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

మంచిర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడిజిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లాలో గురు వారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8గంట లకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. ఓటింగ్ సమయం ముగి సేస రికి క్యూ లైన్‌లలో ఉన్న వారిని అధికారులు ఓటు వేసేందుకు అనుమతిని ఇచ్చారు. జిల్లాలో ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకోసం 18పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 40పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా జిల్లాల్లో మొత్తం 54మంది పట్టభద్రుల విభాగం లో నామినేషన్లు దాఖలు చేయగా టీచర్ ఎమ్మెల్సీ కోసం 16మంది బరిలో నిలిచారు. జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 30,921 మంది ఓటర్లు ఉండగా టీచర్స్ ఎన్ని కలకు 1664 మంది ఓటర్లు ఉన్నారు.

పట్టభద్రుల పోలింగ్ శాతం..

జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు 30,921 మంది ఉండగా వారిల 20,811మంది తమఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల విభాగంలో 67.30శాతం పోలింగ్ నమోదు అయింది. ఉపా ధ్యాయ ఓటర్లు మొత్తం 1664మంది ఉండగా వారి లో 1527మంది ఓటర్లు తమఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ విభాగంలో 91.77శాతం పోలింగ్ నమోదు అయింది.

హోరాహోరీగా సాగిన పోలింగ్...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం హోరాహోరీగా పోలింగ్ జరిగింది. పట్టభద్రుల విభాగంలో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్‌పీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణల మధ్య త్రిముఖ పోటీ నెల కొంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ఎవరిని కదలించిన ముగ్గురికి సమానంగా ఓటువేసి నట్లు వెల్లడించారు. పోలింగ్ జరిగిన తీరునుబట్టి చూస్తే ప్రధాన పోటీ అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి మధ్యనే ఉన్నట్లు మెజార్టీ ప్రజలు భావి స్తున్నారు. ప్రసన్న హరిక్రిష్ణ మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వస్తుందనే వ్యాఖ్యలు వినిపి స్తున్నాయి.

భారీగా నగదు పంపిణీ...

కాగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్ద మొత్తంలో ఓటర్లకు నగదు పంపిణీ జరిగి నట్లు ప్రచా రం. మధ్యాహ్నం 12గంటలకు ఓటింగ్ సరళిని అంచనా వేసిన అభ్యర్థులు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు పెద్ద మొత్తంలో..

మిగతా 7లో

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు...

ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ విభాగాల్లో ఓట్లు వేసేందుకు భారీగా తరలివచ్చారు. పట్టభద్రుల విభాగానికి సంబంధించి మంచి ర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, ఆయన సతీమణి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ స్థానిక పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, ఆయన తనయుడు విజిత్‌రావు స్థానిక ఆర్‌బీ హెచ్‌వి పాఠశా లలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ దంపతులు సైతం తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పట్టభద్రులతో పోలిస్తే ఉపాధ్యాయ విభాగంలో పోలింగ్‌శాతం అధికంగా నమోదు అయింది.



ఓటు హక్కును వినియోగించుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు, అభ్యర్థి నరేందర్‌రెడ్డి



ఓటు వేసిన కవలలు, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు,విజిత్‌కుమార్



పురాణం సతీశ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ దంపతులు



లక్సెట్టిపేటలోపోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు



చెన్నూరు పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన పట్టభద్రులు

డీసీపీకి ఫిర్యాదు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు డీసీపీకి ఫిర్యాదు చేశారు. నస్పూర్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ నాయకుడు కమలాకర్‌రావుపై నస్పూర్ ఎస్‌ఐ సుగుణాకర్ చేయిచేసుకోవడంతో ఎస్‌ఐ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆందోళన చేస్తుండగా మంచిర్యాల ఏసీపీ, సీఐ ఉన్న సమయంలో కాంగ్రెస్ గుండాలు బీజేపీ కార్యకర్తలపై పోలీసుల లాఠీలు లాక్కుని దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి, దుర్గం అశోక్, గాజుల ముకేష్‌గౌడ్, పురుషోత్తం, శ్రీదేవి, రమేష్, రవి, పురుషోత్తం జాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బర్డ్ ఫెస్టివల్

జన్నారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మార్చి 1, 2 తేదీల్లో కలెక్టరేట్‌లో కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు తెలిపారు. ఉ దయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు ఫెస్టివల్ ప్రారంభమవుతుం దని, 11.30 నుంచి 12 గంటల వరకు డాక్టర్ బిక్షన్ బుద్ధా పాల్గొంటారని, 12 గంటల నుంచి 1 గంట వరకు పక్షుల మైగ్రేషన్ స్టడీపై డాక్టర్ సత్యసెల్వం మా ట్లాడుతారని తెలిపారు. 1 గంట నుంచి 1.30 గంటల వరకు రాష్ట్ర పక్షి అధికారు లు సంజీవ్ మీనన్ పాల్గొంటారని 2.30 గంటల నుంచి 3 గంటల వరకు రాజ స్థాన్‌కు చెందిన సన్‌బాయిలేక్ షార్ట్ డాక్యుమెంటరీ ఉంటుందని, 3గంటల నుంచి హైద్రాబాద్‌కు చెందిన పక్షుల ప్రత్యేక అధికారి రాంరెడ్డి పాల్గొంటారని తెలిపారు. 4 గంటల వరకు బర్డ్ కన్జర్వేషన్ ఐఎఫ్‌ఎస్ అనురాగ్ మిశ్రా మాట్లాడుతారని , 4.30 గంటలకు బర్డ్ బయోగ్రఫీ ఉంటుందని తెలిపారు. రెండవ రోజు ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల కార్యక్రమం పునః ప్రారంభం ఉండగా 12 గం టల వరకు బర్డ్స్ డాక్యుమెంటరీ, బర్డ్స్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి డాక్టర్ సత్యసెల్వం, ప్రొఫెసర్ మహేష్, డాక్టర్ విజయన్, డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ పాల్గొంటారని తెలిపారు.

పుణ్యస్నానాలు..మొక్కుల చెల్లింపులు

- వేలాల, కత్తెరసాలలో భక్తుల రద్దీ..
- ముగిసిన జాతర ఉత్సవాలు



వేలాల మల్లికార్జున స్వామి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

జైపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని మం డలంలోని వేలాల గ్రామంలో భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం గుట్టపైన గ ట్టు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు గురువారం తెల్లవా రుజామున గుట్ట కిందకు పయనమయ్యారు. వేలాల గ్రామంలోని మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి ముందుగా గోదావరి పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నా నాలు ఆచరించి ఆలయం వద్ద బారులు తీరారు. ఆయాప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. మరికొంత మంది భక్త లు గొర్రె పిల్లలతో గోదారమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి సమీపాన భక్తులు తలనీలాలు సమర్పించారు. మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు ఉ దయం నుంచి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. క్యూలైన్‌ల కోసం ఏర్పాటు చేసిన పందిర్లు భక్తులతో నిండిపోయాయి. సుమారు 3 లక్షల మందికి పైగా భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో రమేష్ పేర్కొన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీని నియంత్రిం చేందుకు పోలీసులు కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసి జాతర ప్రదేశాలను, రద్దీ ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. గోదావరి వద్ద స్నానాలు చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా నల్లాలను ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు వేలాల గ్రామ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసా గర్, ఎంపీవో శ్రీపతి బాపురావు జాతర పనులను పరిశీలిస్తూ గ్రామంలో, గోదావరి వద్ద పారిశుధ్యలోపం తలెత్తకుండా పంచాయతీ సిబ్బందితో చర్యలు చేపట్టారు. భక్తులు ఎండ వేడికి సేద తీరేందుకు ఐస్‌క్రీం సెంటర్లు, జ్యూస్ బండ్ల వద్ద బారు లు తీరారు. మంచిర్యాల, గోదావరిఖని, మంథని డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపించారు.



కత్తెరసాలలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



పెద్దపేట పావురాజేశుస్వామి ఆలయం వద్ద శివసత్తుల వద్ద పూజలలో భక్తులు

కొనసాగుతున్న జాతర

చెన్నూరు : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండ లంలోని కత్తెరసాల గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర కొనసాగుతుంది. గురువారం భక్తు లు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బోనాలు పోసి తీపి పదార్థాలతో నైవేద్యం సమర్పించారు. ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి స్వా మి వారికి బండారు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు అన్న సంతర్పణ చేశారు.

పెద్దపేటలో వైభవంగా పావురాజేశ్వరుడి జాతర

దండేపల్లి : యాదవ కులస్థుల ఆరాధ్యదైవమైన దండే పల్లి మండలం పెద్దపేట శివారులో పావురాజేశ్వరుడి (అల్లంల పావురాయుడుస్వామి) దేవాలయంలో గురు వారం వైభోపేతంగా జాతర జరిగింది. ఇక్కడ మహాశివ రాత్రి పర్వదినాన్ని సందర్భంగా బుధవారం నుంచే గోదా వరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పావురాజేశ్వరుడి స్వామి దేవాలయానికి యుదవ కులస్థులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజ, జాగరణ చేశారు. పావురాజేశ్వరుడిస్వామికి ప్రత్యేక నైవేద్యాలు వండి స్వామి ఆలయం చుట్టు ప్రదక్షణ చేసి సమర్పించా రు. దేవతమూర్తులను గంగజలాభిషేకం పూజలు చేశారు. భక్తులకు శివసత్తుల పునకాలు రావడంతో ఆలయం చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక నైవేద్యాల కు శివసత్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి యేట శివరాత్రి తర్వత వారి పిల్లల పుట్టువెంట్రుకలతో పాటు పిల్లల మొక్కుల కోసం బంగారం(బెల్లం) తులా భారం వేశారు. ఈజాతర వేడుకలను ఉమ్మడి జిల్లాలతో పాటు జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది యాదవ కులస్థులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద పలు రకాల దుకాణాలు వెలసిశా యి. దీంతో భక్తులతో సందడి నెలకొంది.